ప్రజాశక్తి
ఆదివారం 13 ఆగస్టు 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అన్నదాత విలవిల

- ఎండుతున్న వరిపొలాలు
- ముదురుతున్న ఆకుమడులు
- 9 మండలాల్లో లోటు వర్షం
- ఉడుపులు 8 శాతమే

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కొత్తకోట, పాయకరావుపేట, అనకాపల్లి, వి.మాడుగుల, నక్కపల్లి విలేకర్లు

జిల్లాలో వర్షాలు సరిగాలేక ఉడుపులు పడ్డంలేదు. ఎండతీవ్రతకు ఉడిసిన వరిచేలు, ఆకు మడులు ఎండిపోతున్నాయి. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైన మండలాల్లో వేసవి కాలంవలె పొలాలు బీటలు దేరుతున్నాయి. వర్షాలు పడినా ముదిరిన ఆకుతో ఉడుపులు వేసినా దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో జూన్ ఒకటి నుంచి ఆగస్టు 12 ఉదయం 8.30 గంటల వరకు 362.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా 327 మిల్లీమీటర్లు కురిసింది. 24 మండలాల్లో చీడికాడ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదుకాగా, 14 మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది. ఇంకా 9 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాభావ ప్రభావం ఉడుపులపై పడింది. జిల్లాలో వరి 1.36 లక్షల ఎకరాల్లో సాగుకావాల్సివుండగా, ఆగస్టు 11 నాటికి 11,442 ఎకరాల్లో ఉడుపులు (8 శాతం) పడ్డాయి. గతేడాది ఇదే తేదీకి 29,090 ఎకరాల్లో వరి సాగు నమోదైంది.

వర్షాలు సరిగాలేకపోవడంతో జలాశయాల్లో సంతృప్తికరంగా నీరులేదు. చెరువులు నిండలేదు. దీంతో రైతులు దమ్ములు చేయలేకపోతున్నారు. సబ్బవరం మండలంలో 3,422 మిగతా 2లో..



రావికమతంలో బీటలుదేరుతున్న వరి పొలం



మార్టూరులోని ఓ ఆకుమడి



సదస్సులో మాట్లాడుతున్న బేబిరాణి

శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు బేబి రాణి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబి రాణి డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శ్రామిక మహిళా విశాఖ జిల్లా సదస్సు ఎల్ఐసి యూనియన్ నాయకులు మిగతా 2లో..

భారీగా రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని ఖుర్దా డివిజన్‌లో మూడో లైన్‌ను ప్రారంభించేందుకు భువనేశ్వర్, మంచేశ్వర్, హరిదాస్‌పూర్ -ధన్మండల్ మధ్య నాన్ - ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఆగస్టు 16 నుంచి 28వ తేదీ వరకూ 96 రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో గౌహతి, హౌరా, షాలిమార్, అగర్తల, భువనేశ్వర్, దిబ్రూగఢ్, కటక్, భాగల్పూర్, సిల్చార్, తిరుపతి, సికింద్రాబాద్, తిరువనంతపురం, మిగతా 2లో..

15న టిడిపి విజన్ డాక్యుమెంట్ విడుదల

వార్త 8లో..

ఒపిఎస్ అమలుకు ఫ్యాప్టో మహాధర్నా

వార్త 5లో..

మోడీ పాలనలో కార్మిక వర్గంపై పెరిగిన దాడులు

వార్త 8లో..



వరలక్ష్మి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పవన్ కల్యాణ్

విశాఖలో అడ్డగోలు భూదోపిడీ

అసాంఘిక శక్తులుగా వాలంటీర్లు
జనసేన అధినేత పవన్ కల్యాణ్

వార్త మెయిన్‌లో..

వారాహి విజయయాత్రలో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మాట్లాడాలి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి విజ్ఞప్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన వారాహి విజయ యాత్రలో స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణపై పవన్ కల్యాణ్ మాట్లాడాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. జనసేన వారాహి విజయయాత్ర పేరిట విశాఖలో సభలు నిర్వహించడాన్ని జెఎసి నేతలు స్వాగతించారు. అయితే ఈ నెల 10 నుంచి జరుగుతున్న సభల్లో స్టీల్‌ప్లాంటు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం గురించి మాత్రం పవన్ ప్రస్తావించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 900 రోజులకుపైగా విశాఖలోనూ, రాష్ట్ర వ్యాప్తంగానూ ఉద్యమం సాగుతున్న విషయాన్ని పవన్‌కు గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీసి, కావాలని నష్టాల్లోకి నెట్టి ప్రైవేటీకరించే కుట్రలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. తాజాగా అదానీ గంగవరం పోర్టు నుంచి ప్లాంటుకు ఓడల ద్వారా వచ్చే ముడిసరుకు వెళ్లకుండా అడ్డుకుంటోందన్నారు. మరోవైపు రైల్వే, రక్షణరంగం, ఎల్ఐసి, బ్యాంకులు, పోర్టు, బిఎస్ఎన్ఎల్, ఆయిల్ ఇతర ప్రభుత్వరంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖను ఆర్థికంగానూ కేంద్రం దెబ్బతీస్తోందన్నారు. యువత ఉపాధిని దారుణంగా హరిస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం యొక్క ఈ ప్రజా ద్రోహంపై పవన్ ఇంతవరకూ జరిగిన బహిరంగ సభల్లో మాట్లాకపోవడం సరైనది కాదన్నారు. అన్యాయం జరిగిన చోట ప్రశ్నిస్తానన్న జనసేన అధినేత బిజెపి ద్రోహాన్ని కూడా నిలదీయాలన్నారు. మిగతా సభల్లోనైనా పై సమస్యలను ప్రస్తావించి విశాఖ ప్రజలకు, యువతకు, కార్మికలకు భరోసా ఇవ్వాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అన్నదాత విలవిల

ఎకరాలకు సెంటు భూమిలో కూడా ఉడుపులు కాలేదు. కశింకోట మండలంలో 2,230 హెక్టార్లకు రెండున్నర ఎకరాల్లో నాట్లు పడ్డాయి. వర్షాలు తక్కువ కురిసిన మండలాల్లో వరి ఉడుపులు తక్కువగా నమోదయ్యాయి. కె.కోటపాడు మండలంలో 6,065 ఎకరాలకు 27 ఎకరాలు, అనకాపల్లిలో 7,300 ఎకరాలకు 150, మాకవరపాలెంలో 3085 ఎకరాలకు 310, మునగపాకలో 3197 ఎకరాలకు 12, అచ్యుతాపురంలో1905 ఎకరాలకు 80, యలమంచిలిలో 5,510 ఎకరాలకు 240, నక్కపల్లిలో 5,125 ఎకరాలకు 617, పాయకరావుపేటలో 7912 ఎకరాలకు 395, రాంబిల్లిలో 6,815 ఎకరాలకు 347 ఎకరాల్లో రైతులు ఉడుపులు వేశారు

రావికమతం మండలంలో వరినారు మడులు ఎండిపోతున్నాయి. కళ్యాణపులోవ జలాశయం నుంచి నీరు విడుదల చేయకపోవడంతో దీనికిందవున్న నాలుగువేల ఎకరాల ఆయకట్టు ఎండిపోతోంది. ఆకుమడులను రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేట మండలం నామవరానికి చెందిన పక్కుర్తి సుబ్బారావు వరి పొలం నీరులేక ఎండిపోతోంది. అనకాపల్లి మండలం మార్టూరుకు చెందిన ఎం.పైడిరాజు ఆకు మడి బీటలు దేరింది. వర్షం పడినా ఉడుపులు చేసుకొనేందుకు వీల్లేనంతంగా నారు ఎండిపోయింది. వి.మాడుగుల మండలం ఎం.కోడూరులో వరి పంట పొలం ఎండిపోతోంది. 2000 సంవత్సరంలో గండిపడ్డ తాచేరు జలాశయానికి నేటికీ మరమ్మతు చేయకపోవడంతో 3,400 ఎకరాల ఆయకట్టుకు సరిగా నీరు అందని పరిస్థితి నెలకొంది. పరివాహక ప్రాంతం నుంచి వచ్చిన నీరు జలాశయంలో నిల్వ చేసుకొనే అవకాశంలేదు. పై నుంచి వచ్చిన నీరు బయటకు పోవడంతో జలాశయ కాలువ ద్వారా నీరు సరిపడా రాకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఉడుపులు వేసిన వరి పొలాలను రక్షించుకోలేక రైతులు బాధపడుతున్నారు. కొత్తగా ఉడుపులు చేయలేకపోతున్నారు.

వర్షపాతం లోటు ఇలా..

కె.కోటపాడులో 20.8, అనకాపల్లిలో 32, మాకవరపాలెంలో 22.5, మునగపాకలో 27.4, అచ్యుతాపురంలో 32.9, యలమంచిలిలో 31.4, నక్కపల్లిలో 42.2, పాయకరావుపేటలో 28.8, రాంబిల్లిలో 26.1 శాతం వర్షపాతం లోటువుంది. సాధారణం కంటే 43 మిల్లీమీటర్లు అదనంగా వర్షపాతం నమోదైన చీడికాడ మండలంలో 6,682 ఎకరాలకుగానూ 2,705 ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

వ్యవసాయ శాఖ డివిజన్ల వారీ వివరాలు (ఎకరాల్లో)

డివిజన్	సాధారణసాగు	నమోదు
అనకాపల్లి	16,492	227
యలమంచిలి	22,927	1947
చోడవరం	32,430	4,835
పాయకరావుపేట	35,637	2,452
నర్సీపట్నం	28,972	1980

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మాట్లాడాలి

అమిత్‌షాల వద్ద తనకున్న పలుకుబడితో స్టీల్‌ప్లాంటు అమ్మకం ఆపే ప్రకటన చేయించాలన్నారు. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. అదానీ గంగవరం పోర్టులో కార్మిక చట్టాలు అమలు చేయించాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు పడాల రమణ, బి.నాగభూషణం, కన్వీనర్లు ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.కనకారావు, వై.మస్తానప్ప, జెఎసి నాయకులు దొమ్మేటి అప్పారావు, వి.రామ్మోహన్‌కుమార్, కె.శంకరరావు ఉన్నారు.

శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలి

సూర్యప్రభ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన బేబి రాణి మాట్లాడుతూ శ్రామిక మహిళలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజు రోజుకూ పని భారం పెంచుతున్నాయన్నారు. వారికి ఏ విధమైన కార్మిక చట్టాలూ అమలు చేయకుండా, అత్యంత తక్కువ వేతనాలతో వారి శ్రమను దోచుకుంటున్నాయన్నారు. పేదలకు సహాయం అందిస్తున్నటువంటి అనేక పథకాల్లో మహిళా కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. వారు వివక్షతకు గురౌతున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల హక్కులను కాలరాస్తోందన్నారు. మహిళలను వంట ఇంటికే పరిమితం చేయాలనే మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. మహిళలకు రాత్రివేళల్లో డ్యూటీలు వేయకూడదని చట్టాలున్నా అమలు చేయడం లేదన్నారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి పి.మణి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసి, దేవి, ఆశా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, మిడ్డేమీల్స్ యూనియన్ కార్యదర్శి మంగశ్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అనసూయ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బి.రత్నం, ఎల్ఐసి డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి ఆర్‌పిల యూనియన్ అధ్యక్షులు అలివేణి, హాస్పిటల్స్, షాప్స్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఇంటిపనివారు, ఇతర సంఘాల నుంచి శ్రామిక మహిళా నాయకులు హాజరయ్యారు.

మణిపూర్ వాసులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆర్చి డయాసిస్ ఆఫ్ విశాఖపట్నం, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నగరంలో క్రైస్తవ విద్యార్థులు శాంతి సామరస్య ర్యాలీ నిర్వహించారు. మహారాణిపేటలోని ఆర్చి బిషప్స్ హౌస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జగదాంబ జంక్షన్, డాబా గార్డెన్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు సాగింది. మల్లవరపు జాన్ ప్రకాష్, ఆర్‌జి.ప్రకాష్, నునమ్ జోజి పాల్గొన్నారు.

ప్రశ్న వదిలి ఫిర్యాదుల మార్గంలో జనసేనాని !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విచక్షణ లేని వీరత్వం వన్నె కెక్కదు' అని ప్రపంచ ప్రఖ్యాత రచయిత షేక్స్‌పియర్ మాటలు విన్నవారెవరికైనా విశాఖలో పవన్ పర్యటనపై క్లారిటీ రాకమానదు. అవాంఛనీయ ఘటనలకు మూలాల్లోకెళ్లి పరిశీలించకుండా ఒక రంగంపై నిందలు వేసే ప్రక్రియకు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టాడని చెప్పక తప్పదు. పవన్ కల్యాణ్‌కు రాష్ట్రంలో ఎక్కడకెళ్లినా మంచి ఫాలోయింగ్ ఉంది. ఫ్యాన్స్ కేరింతలు, చప్పట్లతో బ్రహ్మరథం పడతారన్నది వాస్తవం. తను ఒక హీరో కావడమే దీనికి ప్రధాన కారణం. ఈ వీరత్వాన్ని రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చూపిస్తే రాష్ట్రం బాగుపడుతుందన్న వారూ లేకపోలేదు. పైగా కేంద్రం వద్ద తన పలుకుబడి అంతా ఇంతా కాదని విశాఖలో జరుగుతున్న వారాహి విజయయాత్రలో పవన్ పదేపదే చెప్పారు. అయితే, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 912 రోజులుగా ప్రజలు, కార్మికులూ పోరాడుతుంటే పవన్ ఆ అంశం జోలికి మాత్రం పోకపోవడం గమనార్హం.

వాలంటీర్ల వ్యవస్థనే టార్గెట్

రాష్ట్రంలోగానీ, విశాఖ నగరంలోగానీ అనేకమైన దుర్ఘటనలు ఇటీవల కాలంలో జరుగుతున్న మాట నిజమే. శనివారం నాటి పవన్ కల్యాణ్ పర్యటన ఆద్యంతం వాలంటీర్ల వ్యవస్థనే టార్గెట్ చేసినట్టు కనిపించింది. ఇటీవల పెందుర్తి ప్రాంతంలో ఓ వృద్ధురాలి ఇంట్లోకి వాలంటీర్ వెళ్లి బంగారం, డబ్బు కోసం ఆమెను హత్య చేసిన ఘటన వెలుగుచూసిన సంగతి తెలిసిందే. వారి కుటుంబాన్ని ఒక రాజకీయ నాయకుడిగా పవన్ పర్యటించడాన్ని తప్పు పట్టాల్సిన పనిలేదు. ఈ సందర్భంగా తీవ్రమైన ఉద్వేగానికి



గురికావడం, ఆయన మాట తీరు చూస్తే ఒక రాజకీయ ప్రాజెక్టు కోసం పవన్ ఆరాటపడుతున్నారన్న వారూ లేకపోలేదు. ఆర్థిక అసమానతలగల సమాజంలో ఉద్యోగాలు రాక యువత నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది దొంగతనాలకూ పాల్పడుతున్నారు. ఈ తరహా ఘటనలే పోలీస్ రికార్డుల్లోకి వస్తున్నాయి. వాలంటీర్ల ప్రమేయంతో ఎక్కడైనా చిన్న ఘటన జరిగితే పవన్ ఇదొక రాజకీయ ప్రాజెక్ట్‌గా చేపట్టాలన్న తాపత్రయం కనిపిస్తోంది.

కేంద్రం కారణమైన పలు సమస్యలపై ముఖం చాటేసిన జనసేనాని

తాను ఏ విషయం మీదనైనా అధ్యయనం చేయకుండా మాట్లాడనంటూ తొలిరోజు జగదాంబ జంక్షన్‌లో జరిగిన సభలో పవన్ చెప్పారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధ్వంసకరమైన విధానాలతో నలిగిపోతున్న విశాఖను పవన్ అధ్యయనం చేయలేదా ? లేదంటే మోడీకి తాను ఇష్టమైన వ్యక్తి కాబట్టి వాటి వైపు కన్నెత్తి చూడాలనుకోలేదా ? అనేవారూ విశాఖలో లేకపోలేదు. విశాఖ నగరంలో అట్టుడికిపోతున్న సమస్యలు చాలా ఉన్నాయి. వీటి గురించి సేనానికి పట్టలేదు. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ఆడుతున్న నాటకాలు, హోదాకు మోకాలడ్డడం వల్లనే కొత్త పరిశ్రమలేవీ విశాఖను రావడం లేదన్న వాస్తవాలను పవన్ విస్మరించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై బిజెపి ప్రభుత్వం నేటికీ ఊరిస్తూనే ఉంది. కనీసం డిపిఆర్ కూడా ఆమోదించలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు తొలుత ఇస్తానని చెప్పి తాజాగా మోడీ సర్కారు వయబిలిటీ కాదు అంటూ చేతులెత్తేసింది. కనీసం ట్రామ్ రైలైనా విశాఖ వంటి ప్రధాన నగరంలో ఉండాలని విశాఖ వాసులు కోరుతున్నా దానికీ అతీగతి లేదు.

భారీగా రైళ్ల రద్దు

(మొదటి పేజీ తరువాయి..)

బెంగళూరు, నాగర్‌కోయిల్, కోయంబత్తూరు, తిరుచ్చిరాపల్లి, కన్యాకుమారి, పుదుచ్చేరి, ముజఫర్‌పూర్, న్యూటిన్సుకియా, సిల్‌ఘాట్ టౌన్, తాంబరం, వాస్కోడిగామా, రూర్కెలా, గుణపూర్, జగదల్పూర్, టాటా, రామేశ్వరం, ఖరగ్‌పూర్, విల్లుపురం, పురూలియా, న్యూజల్పైగురి, త్రివేండ్రం, పాట్నా, ఎర్నాకులం, సంత్రాగచ్చి, చెన్నయ్ సెంట్రల్, పారదీప్, మైసూర్, మంగళూరు, విశాఖపట్నం, దిఘా, పుణె స్టేషన్‌ల నుంచి పలు రైళ్లు ఉన్నాయి. రద్దయిన రైళ్లలో 90 శాతం రైళ్లు విశాఖ మీదుగా ప్రయాణించేవి ఉన్నాయి. వీటితో పాటు మరో 10 రైళ్ల గమ్య స్థానాలను కుదించారు. ఈ విషయాన్ని గమనించి ప్రయాణికులు సహకరించాలని రైల్వే సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు.

విజయవాడ డివిజన్‌లో రైళ్ల రద్దు

దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. 17267 కాకినాడ-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 17268 విశాఖపట్నం-కాకినాడ ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ స్పెషల్, 22701 విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 14 నుంచి 20వ తేదీ వరకు, 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 15 నుంచి 21 వరకూ రద్దు చేశారు.

32వ వార్డులో 'మహాశక్తి'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడమే తన ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ అన్నారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న మహాశక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం 32వ వార్డు భీమ్ నగర్, మహారాణిపేట తదితర ప్రాంతాలలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వైసిపి పాలనపై విసిగెత్తి ఉన్నారన్నారు.

27న శబరిమల సమాచార కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 27న శబరిమల సమాచార కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్షులు కె.అయ్యప్పదాన్, ప్రధాన కార్యదర్శి వై.బాలాంజనేయులు తెలిపారు. శనివారం సాయంతం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం విశాఖ శంకరమఠంలో సంఘం జాతీయ కార్యవర్గ ఎన్నిక జరగనుందని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని 5 రాష్ట్రాలలోని సభ్యులు పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు నాగార్జున, కార్యదర్శి నరహరి, కృష్ణయ్య, తాతినాయుడు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు : కోలా గురువులు

ప్రజాశక్తి -ఆనందపురం : కో-ఆపరేటివ్ బ్యాంకుల ద్వారా రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు పేర్కొన్నారు. ఆనందపురం మండలానికి నూతనంగా మంజూరైన కో-ఆపరేటివ్ బ్యాంకు ఏర్పాటుకు శనివారం బిల్డింగ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలకు సంబంధించి అన్ని రకాలు రుణాలను తక్కువ వడ్డీ రేట్లకే అందిస్తామన్నారు. మూడు జిల్లాలలో 98 పిఎసిఎస్ బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. మండలానికి ఒక కో-ఆపరేటివ్ బ్యాంకు చొప్పున 13 జిల్లాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆనందపురం, పద్మనాభ మండలాల్లో బ్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలో రైతులకు రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఇఒ డివిఎస్.వర్మ, డిసిఎంఎస్ డైరెక్టర్ పాండ్రంకి అప్పారావు, పద్మనాభం, వెములవలస, ఆనందపురం పిఎసిఎస్ సెక్రటరీలు కోటేశ్వరరావు, దశావతారం, పంచముఖేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్ లింగం వెంకట్రావు, సూపర్‌వైజర్ వేణుగోపాల్, సిబ్బంది ఎస్ నారాయణరావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్లో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులకు స్థానిక సన్ స్కూల్ యాజమాన్యం శనివారం నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలను అందజేసింది. సన్ స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ నగదు ప్రోత్సాహకాలను తమ పాఠశాలలో అందజేశారు. ఇద్దరికి రూ.5వేలు చొప్పున, మిగిలిన 12 మందికి రూ 3 వేలు చొప్పున నగదు అందజేశారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివరాణి పాల్గొన్నారు.

98వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సింహాచలం: జివిఎంసి 98వ వార్డులో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులోని సమస్యల నడిగి తెలుసుకున్నారు. రిటైనింగ్‌వాల్ లేని విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వార్డులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి అప్పలస్వామి, ఎర్రవరం బాబు, కొలుసు ఈశ్వరరావు, లంక సత్తిబాబు, రామరాజు, పీతల అప్పలరాజు, బట్ట శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ పాఠశాలగా భీమిలి గురుకులం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ ఏడాది పదో తరగతి పరీక్షలో మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కోడి రాంబాబు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ద్వారా తమకు అవార్డు ఇస్తారని ఉన్నత విద్యా శాఖాధికారుల నుంచి సమాచారం అందినట్లు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీకి 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, విద్యార్థుల రోజు వారీ హాజరు, ఉత్తమ బోధన ప్రాతిపదికగా ప్రభుత్వం తమ పాఠశాలను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు బిసి కాలనీ 31వ బూత్ నెంబరులో జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథం పర్యవేక్షణలో శనివారం ఓటర్ల జాబితా పరిశీలన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, మారిన చిరునామాలపై వివరాలు సేకరించారు. ఈ క్రమంలో బిఎల్ఒలు ఒక ఇంటి వద్దకు వెళ్ళి ఓటు నమోదు చేసుకోవాలని కోరగా వారు ఓట్లు అవసరం లేదని చెప్పారు. ఈ విషయమై అక్కడే ఉన్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథం దృష్టికి బిఎల్ఒలు తీసుకెళ్లారు. వెంటనే ఆ ఇంటికి జాయింట్ కలెక్టర్ వెళ్లి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

ఘనంగా ఉమ్మడి దాసు జన్మదిన వేడుకలు



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఉమ్మడి దాసు తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు వైసిపి నాయకుడు ఉమ్మడి దాసు జన్మదిన వేడుకలు శనివారం జోడుగుళ్ళపాలెంలో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతిదాస్ ఆధ్వర్యాన నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, వైసిపి నగర అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వైసిపి సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు హాజరై ఉమ్మడి దాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడాకారులకు వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పేద మత్స్యకార మహిళలకు చీరలు, కార్యకర్తలకు దుస్తులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు అల్లంపల్లి రాజబాబు, పేర్ల విజయచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం, తగరపువలస : స్థానిక కెజిబివిలో అంతర్జాతీయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈకో క్లబ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ శశి ప్రభ మాట్లాడుతూ, యువత సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, అందరికీ మంచి భవిష్యత్తును సృష్టించేందుకు కట్టుబడి ఉండే రోజునే అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. యువత కోసం గ్రీన్ స్కిల్స్.., సుస్థిర ప్రపంచం వైపు యువత అనే నినాదంతో యువజన దినోత్సవం జరుపుకోవడం సంప్రదాయంగా జరుగుతోందని వివరించారు. ప్రపంచ పర్యావరణంపై యువత ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. యువత నైపుణ్యాభివృద్ధి సాధించాలని స్పష్టం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గంగా కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ ప్రతినిధులు రత్నం, ప్రసాద్, భాస్కర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనిట్స్‌లో

తగరపువలస : స్థానిక అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో అంతర్జాతీయ యువజన దినోత్సవం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కైనటిక్ క్యాంపస్ విత్ ఈకోజన్ హౌస్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం, ప్రాజెక్ట్ కే మూవీ ఇన్ఫో సిస్టం తదితర సుమారు 30 ఎగిబిషన్లను ప్రయోగాత్మకంగా ప్రదర్శిస్తూ సృజనాత్మకతను విద్యార్థులు చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ, కార్యక్రమం కన్వీనర్లు డాక్టర్ ఎం.కల్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ ఎ.సత్యఫణికుమారి, కో-ఆర్డినేటర్లు ఎస్.వరసతీష్, డాక్టర్ అభి రునిషా బేగం, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఎస్ఓఎస్‌ను సందర్శించిన సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌ను తెలంగాణ రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం సందర్శించారు. అనాథలకు శాశ్వత అండగా నిలిచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అనాథ పిల్లల సంక్షేమానికి వివిధ రాష్ట్రాల్లో పలు స్వచ్ఛంద సంస్థల పని తీరును మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలోని మంత్రి వర్గ ఉప సంఘం అధ్యయనం చేసింది. నివేదికను సిఎం కెసిఆర్‌కు అందజేయగా, అందుకు అనుగుణంగా మరిన్ని అంశాలు ఉండేలా సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని కెసిఆర్ ఆదేశించినందున మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలి కేరి, సిఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, హరిత హారం ఓ ఎస్డీ ప్రియాంక వర్గీస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ పమేలా సత్పతితో కూడిన ఉన్నతాధికారుల బందం స్థానిక ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌ను సందర్శించింది. విలేజ్ డైరెక్టర్ కోన రవీంద్ర కుమార్, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ కార్యకలాపాలు, అనాథ పిల్లలకు అందిస్తున్న సేవలు, పొందుతున్న సౌకర్యాలు, విలేజ్‌లో ఉన్న పిల్లలు, వారి సంరక్షణ బాధ్యత చూసే తల్లులు అందిస్తున్న సేవలు తదితరాలపై వివరించారు.

పైడితల్లి అమ్మవారి హుండీ సొమ్ము చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ సొమ్ము దొంగలు శుక్రవారం రాత్రి చోరీ చేశారు. దీనిపై ఆలయ ధర్మకర్త బొడ్డు పాలవెల్లి దేవరాపల్లి పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఎప్పుడు మాదిరిగానే ఆలయంలో పనిచేసే ముప్పిరెడ్డి చెల్లయ్యమ్మ శనివారం ఉదయం 6 గంటలకు వెళ్లి ధూప, దీప నైవేధ్యాలు సమర్పిస్తూ గుడి బయట పాదాల వద్ద ఉన్న హుండీ దొంగలపాలైనట్లు గమనించి ఆలయ ధర్మకర్త పాలవెల్లికి సమాచారం ఇచ్చింది. ఆలయ ధర్మకర్త ఆలయ కమిటీ సభ్యులతో ఆలయానికి చేరుకొని పరిశీలించగా, చిరిగిన డబ్బుల నోట్లను అక్కడే విడిచిపెట్టి, హుండీ తాళాలు గుడి వెనుక భాగం చెట్టు కింద వదిలిపెట్టారు. సీసీ కెమెరాలను ముందుగానే గమనించిన దొంగలు కరెంటు కట్ చేసి కెమెరాలను నిలుపుదల చేశారు. గతంలో రెండు, మూడు సార్లు దొంగతనం జరిగినట్లు ధర్మకర్త వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో గోవాడ గ్రామంలో శనివారం విద్యుత్ స్తంభానికి కటౌట్ కడుతుండగా, విద్యుత్ షాక్‌కు గురై అదే గ్రామానికి చెందిన ఏడువాక బంగారు నాయుడు(52) మృతి చెందాడు. గ్రామంలో ప్రధాన కూడలి వద్ద కటౌట్ కడుతుండగా నిచ్చెనకు విద్యుత్ వైరు తగలడంతో షాకు గురయ్యాడు. వెంటనే అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఫ్యాక్టరీలో సీజనల్ కార్మికుడిగా పనిచేస్తున్న బంగారు నాయుడుకి భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- దేవరాపల్లి, చీడికాడ : కారులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను దేవరాపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. కారుతో సహా 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి నాగేంద్ర కథనం ప్రకారం... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నెలతురు గ్రామానికి చెందిన వడ్డెల వాసు (22), వడ్డెల అనీల్ (22), వడ్డెల పెదబాబు (19), రావూరి పవన్ (18)తో పాటు పదిహేడేళ్ల బాలుడు కలిసి కారులో చింతపల్లి మున్యానికి వెళ్లారు. గంజాయి కొనుగోలు చేసి పినకోట, దేవరాపల్లి మీదుగా ప్రకాశం జిల్లాకు వయనమయ్యారు. శ్రీరాంపురం జంక్షన్ వద్ద శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు కారులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు పట్టుబడ్డారు. వెంటనే కారుని తనిఖీ చేయగా, వారి నుండి 6 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితులపై కేసు నమోదు చేసి కారుని, గంజాయిని సీజ్ చేశామని, నిందితుల్ని చోడవరం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు.

చీడికాడ:మండలంలోని అప్పలరాజు పురం గ్రామంలో పారిపోతున్న వ్యక్తి నుంచి తొమ్మిది కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమకు ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి చెరకు కాటా వద్ద పహారా నిర్వహిస్తున్నామన్నారు. తమ సిబ్బందిని చూసి ముగ్గురు వ్యక్తులు పారి పోతుండగా వారిని పట్టుకుని ఆరా తీశామని తెలిపారు.ఒక్కొక్కరి వద్ద బ్యాగుల్లో మూడు కేజీల చొప్పున మొత్తం తొమ్మిది కేజీల గంజాయి పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు రామారావు తెలిపారు.ఈ ముగ్గురు కూడా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తులు.

నవోదయ కాలేజీ పై నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లోని నవోదయ కాలేజీ విద్యార్థిని నాలుగో అంతస్తు నుంచి కిందపడి తీవ్రగాయాలయ్యాయి. నవోదయ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న యశస్విని కాలేజీ భవనం నాలుగో అంతస్తులోని టెర్రస్ నుంచి క్రిందకి పడింది. తీవ్ర గాయాలు కావడంతో కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థినిని చికిత్స కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రిన్సిపల్ మురళి మీడియాతో మాట్లాడుతూ, అనారోగ్యం కారణంగానే విద్యార్థిని ఈ అఘాయిత్యానికి పాల్పడిందని చెప్పారు. అయితే పరీక్ష రాస్తున్న సమయంలో విద్యార్థిని మేడ మీదకు ఎందుకు వెళ్లింది అనేదానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తరాంధ్రలో భూముల దోపిడీ : కెఎస్.చలం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు రూ.20 లక్షల కోట్ల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని, బయటినుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులే దోపిడీ చేశారని యుపిఎస్‌సి మాజీ ఛైర్మన్ కెఎస్.చలం ఆరోపించారు. పౌర గ్రంథాలయంలో శనివారం 'విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎవరు' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నుంచే వేల ఎకరాల భూమి అన్యాక్రాంతమైందన్నారు. దక్షిణ భారతదేశంలో ఉత్తరాంధ్ర కీలక ప్రాంతం కావడంతో అందరి దృష్టి విశాఖ మీద పడిందన్నారు. 92 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉత్తరాంధ్రలో ఉన్నారన్నారు. స్థానికేతరుల దోపిడీ, అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల 1980 నుంచి 30 లక్షల మంది ప్రజలు హైదరాబాద్‌తో పాటు ఇతర ముఖ్యపట్టణాలకు వలస వెళ్లారని ఆవేదన వ్యక్తంచేశారు. 1991 నుంచి స్థానికేతరులే ఎంపీగా ఎన్నికవుతున్నారని తెలిపారు. ఏ పార్టీ వారైనా స్థానికులకే ఎంపీగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ అల్లు గౌరీశంకర్ మాట్లాడుతూ రెండు సామాజిక వర్గాలే రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, స్థానికేతర్లు దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నారే తప్ప ఇక్కడి వారి గురించి ఆలోచించడం లేదన్నారు. సీనియర్ పాత్రికేయులు వివి.రమణమూర్తి మాట్లాడుతూ, పదవులు కోసం బడాబాబులు విశాఖ వస్తుంటే, పేద ప్రజలు పొట్టకూటి కోసం వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర మన చేజారి పోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నన్నయ యూనివర్సిటీ మాజీ విసి ఆచార్య ముత్యాలనాయుడు, మాజీ జిల్లా జడ్జిలు పి.ముత్యాలనాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, ఫిలిం క్లబ్ అధ్యక్షులు నరవ ప్రకాశరావు, అరసం కార్యదర్శి అప్పలరాజు, సామాజిక ఉద్యమకారులు ఎస్‌వి.కిరణ్‌కుమార్, ప్రజా సంఘాల నాయకుడు డాక్టర్ పి.శ్రీనివాస్, ఎఎంఎల్ కాలేజీ మాజీ అధ్యాపకులు నర్సింహరావు తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ భూమి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండలం వాలిమెరక, జుత్తాడ గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసి అధికార పార్టీ నేతల అండదండలతో వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి డిమాండ్‌చేశారు. సర్వే నెంబరు 98, జుత్తాడలో సర్వే నంబర్ 58/2లో గల ప్రభుత్వ భూముల్లో 2 సెంట్లలో చిన్న చిన్న షెడ్లు వేసి విక్రయించేస్తున్నారని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు 60 గజాలు స్థలం ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్ముకుంటున్న వారికి మాత్రం మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకొని ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఆ భూమిని అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్‌చేశారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాధవధార, సింహాచలం : జివిఎంసి 51వ వార్డులో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యాన మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రూ.2 కోట్లు, 47లక్షల 75వేలతో సీతన్నగార్డెన్స్, మాధవధార వుడా కాలనీ, కళింగనగర్, మహత్ కాలనీ ప్రాంతాల్లో బిటి.రోడ్లు, సిసి రోడ్లు, ఎస్‌డబ్ల్యు డ్రైయిన్ల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ భరణి, ఎఇ అర్చన, పైడి ప్రతాప్, తిరుమలరావు, ప్రసన్నరెడ్డి, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, ధర్మావతి, రాణి, అప్పారావు, మోహనరావు, శ్రీను, వినోద్, గణేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: జివిఎంసి 98వ వార్డు పరిధి మధ్యవీధి, పోస్టాఫీసు వీధి, పాత అడవివరం, కాపు దిబ్బ ప్రాంతాల్లో రూ.75.25 లక్షలతో వీధి కాలువలు, రోడ్డు నిర్మాణాలకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ పీవీ నరసింహం శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లునాయుడు, స్థానిక టిడిపి, వైసిపి నాయకులు పంచదార శ్రీనివాసరావు, ఎర్రవరం బాబు, లంక సత్తిబాబు, కొలుసు ఈశ్వరరావు, పీతల అప్పలరాజు పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ టోర్నీని ప్రారంభిస్తున్న బెహరా భాస్కరరావు

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి- గోపాలపట్నం : స్టూడెంట్ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యాన గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో జి.శ్రీనివాస్, పి.దివాకర్ మెమోరియల్ సౌజన్యంతో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. శని, ఆదివారాల్లో జరిగే టోర్నమెంట్‌లో 21 జట్లు తలపడతాయని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్.ప్రకాశరావు, పి.రమణ పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పద్మనాభం : భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో 75 మొక్కలను నాటాలని ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని బుడ్డువలస, అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం, బాంధేవపురం గ్రామాల్లో 'నా దేశం- నా భూమి' 'నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ గీతం ప్రతిజ్ఞ నిర్వహించి మొక్కలు నాటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, బుడ్డివలస సర్పంచ్ పి.సూర్యనారాయణ, అనంతవరం సర్పంచ్ జి.లక్ష్మి, పెంట సర్పంచ్ బి.పావని తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ నుంచి గాజువాకలో 'శంకర్ ఫౌండేషన్' సేవలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక బిసి రోడ్డులో అక్టోబర్ నెల నుంచి శంకర్ ఫౌండేషన్ ఐ ఆసుపత్రి ద్వారా సేవలందించనున్నట్లు డాక్టర్ నటాషా మారియా, డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగారరాజు తెలిపారు. బీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రస్తుతం గాజువాక శాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఇద్దరు సీనియర్ కంటి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆప్టికల్ షాప్, ఫార్మసీ, సహాయక పరిపాలన సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ కమ్యూనిటీకి సేవ చేయడానికి, దాని సేవలను విస్తరించే నిబద్ధతలో భాగంగా గాజువాక బ్రాంచ్‌ను అత్యాధునిక ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు వివరించారు. ఇందులో రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకల సౌకర్యం, అత్యాధునిక రోగనిర్ధారణ విధానాలు, ల్యాబ్ సౌకర్యం, ఆప్టికల్ షాప్, ఫార్మసీ పూర్తి స్థాయిలో ఉన్నాయని చెప్పారు. ఈ ఆసుపత్రిలో కంటిశుక్లం, రెటీనా ఆపరేషన్లు సహా అన్ని సేవలు అందించనున్నట్లు తెలిపారు. గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని కోరారు. అనేక పరిశ్రమలకు ఎంప్యానెల్ చేసిన రోగులకు చికిత్స చేయడానికి, బీమా కవరేజీ, సిజిహెచ్ఎస్, టిపిఏ తదితరాలను ఉచితంగా కవర్ చేయడానికి ఆసుపత్రిలో జనరల్ ఆప్తమాలజీ, గ్లకోమా, రెటీనా, పిడియాట్రిక్స్, ఆర్బిట్ తదితర అన్ని రోగనిర్ధారణ సౌకర్యాలు అందించనున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నటాషా మారియా, బంగారరాజు

14న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -మాధవధార : హార్బర్ అండ్ కోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే శిబిరంలో అపోలో ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని తెలిపారు. రాండమ్ బ్లడ్ సుగర్, బిఎన్ఐ పరీక్ష, టు డి ఎకో, గుండె, ఎముకల సంబంధిత పరీక్ష ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పింఛన్‌దారులందరూ ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సింహగిరికి పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి -సింహాచలం: శనివారం ఉదయం 10:30 తర్వాత సింహగిరిపై భక్తుల పోటెత్తారు. ఉదయం స్వామివారి రాజ భోగం తర్వాత భక్తుల రద్దీ కారణంగా భక్తుల అంతరాలయ దర్శనాన్ని నిలిపివేశారు. స్వామి దర్శనాన్ని గంటల తరపున క్యూ లైన్‌లో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. మంత్రాలయ దర్శనంతో రూ.300 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అన్నదానం వంటశాలను పరిశీలించిన ముత్తంశెట్టి

ప్రజాశక్తి -సింహాచలం: అప్పన్న దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం అన్నదానానికి వెళ్లి భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నదానం ఏవిధంగా ఉందో భక్తులనడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి వంటశాలకు చేరుకుని వంటశాలను, ప్రసాదాల తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాదాలు తయారుచేస్తున్న మహిళలను రోజుకు ఎన్ని పులిహోర ప్రసాదం ప్యాకెట్లను తయారుచేస్తారని ప్రశ్నించారు. సుమారు రోజుకు 2,000 ప్యాకెట్లు తయారు చేస్తామని మహిళలు వివరించారు. అనంతరం అన్నదాన భవనం ఎదురుగా ఉన్న స్థలంలో వ్యాపారులకు షాపులను ఏర్పాటుచేయాలని సూచించారు. వంటశాల, ప్రసాదాల ప్యాకింగ్, అన్నదాన ప్రాంతాల్లో నిర్వహణ సరిగా లేదని, ప్రసాద్ పథకంలో స్టోర్‌ను పులిహోర ప్యాకింగ్ వంటి కొన్నింటిని వేరే ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాసరాజు, బి.రాంబాబు, ఎఇఓ నరసింహారాజు, సూపరింటెండెంట్ పాలూరి నర్సింగరావు, వైసిపి నాయకులు, వర్తకులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లక్ష్మీబాయి, రమణారెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ జంక్షన్‌లో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి హాజరై మాట్లాడారు. గద్దర్ పోరాటం, ఆయన పాటలు మరువలేనివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి రమణారెడ్డి, ముసిరి శ్రీను, వంశీకృష్ణ, ములకపల్లి, కణితి అప్పలరాజు, పెంటయ్య, పెద్దాడ సోమునాయుడు, ఎల్లంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రత్యామ్నాయ మార్గం చూపాలంటూ విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని మెఘాద్రిపేటలో నివాసం ఉంటున్న నేవల్ ఉద్యోగులు, ఈస్టర్న్ నేవల్ కమాండ్ సంబంధించిన టిఎన్‌టియుసి సంఘ సభ్యులు శనివారం ఎమ్మెల్యే గణబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. డ్యూటీకి వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ ఉండటం వల్ల ఉదయం సమయంలో గూడ్స్ రావడం, లారీలు అధిక సంఖ్యలో వస్తుండటంతో సమయానికి విధులకు వెళ్లలేక పోతున్నామని వివరించారు. ఆలస్యమవుతుందని కొన్నిసార్లు వేగంగా వెళ్లే ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ, రైల్వే అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నేవల్ ఉద్యోగులు

విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షులుగా జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉపాధ్యక్షులుగా జెఎంఆర్ నెహ్రూ, ఎం.త్రినాధరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్‌సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రి శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావు, మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులచే మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏకపాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రి తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కె.ప్రభాకర్, ఎంవి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -సింహాచలం: జివిఎంసి 97వ వార్డు పరిధిలో వాలంటీర్ హత్యచేసిన వృద్ధురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు సింహాచలం మీదుగా వెళ్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు పంచగ్రామాల సమస్యలపై వినతిపత్రం అందించారు. రానున్న ఎన్నికల్లో జనసేన మేనిఫెస్టోలో పంచ గ్రామాల సమస్యను పరిష్కరిస్తామని పొందుపరచాలని స్థానిక జనసేన నాయకులు ఎం.సూరిబాబు ఆధ్వర్యాన పలువురు పార్టీ నాయకులు, స్థానికులు కలిసి పవన్‌కల్యాణ్‌కు వినతి పత్రాన్ని అందించారు.

పాలవలసలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఎక్యూజ్ కళాశాల ఆధ్వర్యాన పాలవలస గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. 'నా భూమి నా దేశం' కార్యక్రమంలో భాగంగా దత్తత గ్రామమైన పాలవలసలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు.



అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో ధర్నాలో మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ చిన్నబ్బాయి

ఒపిఎస్ అమలుకు ఫ్యాప్టో మహాధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జిఒ 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా చైర్మన్ దాసరి జోజిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఫ్యాప్టో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 12 గంటల దీక్షా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యకలాపాల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. క్రమం తప్పకుండా ఉద్యోగోన్నతులు కల్పించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. జివిఎంసిలో మ్యాపింగ్ పేరుతో 14 మంది ఉపాధ్యాయులకు నాలుగు మాసాలుగా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు టి.అంబేద్కర్, టి.రామకృష్ణారావు, ఎ.ధర్మేందర్ రెడ్డి, ఆర్‌వి.వీరభద్రరావు, ఎస్.జయశ్రీ, ఎస్.ధనుంజయరావు పాల్గొన్నారు. దీక్షకు ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.భానుమూర్తి మద్దతు తెలిపారు.

అనకాపల్లి : ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ల గడుస్తున్నా ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సిపిఎస్ రద్దు విషయంలో ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారన్నారు. జిఒ 117 వల్ల ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొందని, తక్షణమే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. పిఎఫ్/ ఏపీజిఎల్ఐ డబ్బులను ప్రభుత్వం దారిమళ్లించి తమ సొంత ఖర్చులకు వాడుకోవడం అన్యాయమన్నారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ వై.సుధాకర్‌రావు మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు మూడు నెలలు గడుస్తున్నా జీతాలు చెల్లించలేని చేతకాని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్.సన్యాసి నాయుడు, కార్యవర్గ సభ్యులు మధు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమరాన త్రినాథ్, వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రేమ్ కుమార్, సిహెచ్.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, గణేష్, వై.శ్రీనివాసరావు, జోగా రాజేష్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

బిఎల్ఒలకు కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు, తేడాలు లేకుండా పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఈఆర్ఓలు, బిఎల్ఓలను ఆదేశించారు. అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలలో శనివారం పర్యటించి బూత్ లెవెల్ అధికారులతో సమావేశమయ్యారు. ఓట్లు చేర్చడం, తొలగించడం, మార్పు చేయడానికి అవసరమైన డాక్యుమెంట్లు తప్పక ఉండాలన్నారు. నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి అమలు చేయాలన్నారు. ఎటువంటి ఒత్తిడికిలోను కాకుండా నియమాల ప్రకారం పని చేయాలని సూచించారు. అనకాపల్లి మండలం సర్పింగబిల్లి సచివాలయం, ఎలమంచిలి పట్టణంలోని నెహ్రూ నగర్ సచివాలయం, బుచ్చయ్యపేట ఎంపీడీవో కార్యాలయాల్లో ఈఆర్వోలతో ఆయన సమావేశమై ఓటర్ల నమోదు ప్రక్రియ ఏ విధంగా చేస్తున్నది తనిఖీ చేశారు. బిఎల్ఓలను ప్రశ్నలు అడిగి వారికి గల అవగాహన, వారు ఏ విధంగా పనిచేస్తున్నారనేది తెలుసుకున్నారు. వారికి దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఆయా నియోజకవర్గాల ఈఆర్ఓలు ఆర్డిఓ ఎ.చిన్నికృష్ణ, ఎస్ఎడిసి ఎస్డీసీ కె.జ్ఞానవేణి, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి ప్రమీల గాంధీ పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 50 మందికి పైగా బిఎల్‌వోలు హాజరయ్యారు.



బిఎల్ఒలు చేసిన పర్కును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి

ఆర్యభట్ట పాలిటెక్నిక్‌లో నాణ్యమైన విద్యా బోధన

కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణరావు

ప్రజాశక్తి- సబ్బవరం

"పాలిటెక్నిక్ చదవాలనుకునే విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓ ఆత్మీయ ప్రశ్న? మీరు ఎలాంటి కాలేజీలో చేరాలనుకుంటున్నారో / చేర్పాలనుకుంటున్నారో స్పష్టత ఉందా? స్పష్టత ఉంటే సగం గెలిచినట్లే" అని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణ రావు అన్నారు. తమ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉన్నట్లు ఆయన చెప్పారు. అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుకై వారు కోరుకున్న బోధన, శిక్షణ, సౌకర్యాలు, జవాబుదారీతనం ఉన్న కాలేజీ కొరకు అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. శ్రేష్ఠమైన విద్యా ప్రణాళికతో నాణ్యమైన బోధన గావించే ఏకైక పాలిటెక్నిక్ కాలేజీ ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల అని చెప్పారు. తమ కళాశాలలో క్రమశిక్షణతో అనుభవజ్ఞులైన సాంకేతిక విద్యా నిపుణులచే విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలకు అనుబంధంగా గురుకుల వాతావరణంలో ఉచిత ప్రభుత్వ హాస్టల్ వసతి ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రామాణికమైన ఇంజనీరింగ్ పుస్తకాలతో రాత్రి 7 గంటల వరకు లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. క్రీడా సౌకర్యాలు, శిక్షణ ఇచ్చే వనరులు ఉన్నాయని చెప్పారు. రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఈ-సెట్ శిక్షణ ఇచ్చే అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులు ఫైనల్ ఇయర్‌లో ఉండగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ 6 నెలలు కాలంలో నెలకు రూ.10వేలు స్టయిఫండ్ ఏర్పాటు చేసే శక్తి సామర్థ్యాలు తమ విద్యా సంస్థకు ఉందని పేర్కొన్నారు. ఐటిల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంటెక్) చదవాలనే మీ ప్రగాఢ వాంఛ సఫలీకృతమయ్యేందుకు దారి చూపగలిగిన మార్గదర్శకత్వం వహించగలిగిన వృత్తి నిపుణులచే ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కాలేజీలో సమృద్ధిగా నీరు, ఆహ్లాదకరమైన వాతావరణం, అన్ని మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలు, విశాలమైన తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 2022-23లో ఫైనల్ ఇయర్ చదివిన విద్యార్థులకు కాలేజీ ప్రాంగణ నియామకాల్లో బ్రేక్ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 11 మంది విద్యార్థులు, డైకిన్‌లో 10 మంది, అపోలో టైర్స్ కంపెనీలో ఐదుగురు, ఫైజర్ కంపెనీలో 11 మంది, సినర్జీస్ కంపెనీలో ఆరుగురు, ఇసుజు కంపెనీలో ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాల్లో ఎంపికైనట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి టాపర్స్, మెరిట్, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ప్రథమ ఎంపిక చేస్తున్నారన్నారు. డైరెక్ట్ అడ్మిషన్ల కోసం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కాలేజీ, గాలిభీమవరం, సబ్బవరం, అనకాపల్లి జిల్లా - 531035 అడ్రస్‌కు సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8096907545, 7799371679, 9573403485, 8106498708 నెంబర్లకు, www.aryabhattapolytechnic.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.



ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల


ఇండస్ట్రియల్ టూర్‌లో పాల్గొన్న ఆర్యభట్ట పాలిటెక్నిక్ విద్యార్థులు


విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

'అయ్యన్న'లో ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి - కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యా సంస్థల్లో ప్రతి ఏటలాగే ఈ సంవత్సరం కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముందస్తుగా శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఆట మైదానంలో విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో సందడి చేశారు. విద్యార్థుల ప్రదర్శించిన వివిధ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మువ్వన్నెల పొడవాటి పతాకం, 76వ సంఖ్య అకారంలో విద్యార్థులు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ముక్తకంఠంతో పలికిన భారత్ మాతాకీ జై, మేరా భారత్ మహాన్, జైబోలో భారత్ మాతాకీ, వందేమాతరం నినాదాలు మిన్నంటాయి. విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు ముందుగా చెప్పారు.

54వ వార్డులో వైసిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 54వ వార్డు పరిధి కంచరపాలెం అచ్చిబాబు కల్యాణమండపంలో వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ చల్లా రజిని, వైసిపి నాయకులు ఈశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, 2024లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని అన్నారు. వార్డుకు సంబంధించిన ఓటరు లిస్టు వెరిఫికేషన్, సంక్షేమ పథకాలు అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కెపి.రత్నాకర్, కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, చిరంజీవి, రవణమ్మ, సోమేష్, దివాకర్‌రెడ్డి, రాంబాబు, వి.శ్రీను, వెంకటేష్, బాల, ఆనంద్, శంకర్, దిలీప్, కళ్యాణ్, ప్రకాష్, అచ్చుతరావు, లాయర్ ప్రసాద్, రమేష్, గౌరీప్రసాద్, సిహెచ్ శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

స్వీయ సాధికారత సాధించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫాకల్టీ టీచింగ్‌తో పాటు స్వీయ సాధికారత సాధించాలని దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. రెండు రోజులుగా డైట్‌లో జరిగిన నేక్ సెమినార్ ప్రాయోజిత సెమినార్ నిర్వాహకులను శనివారం ఆయన అభినందించారు. సెమినార్లు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్సులు వంటి ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహించడానికి అన్ని చట్టబద్ధమైన సంస్థలకు దరఖాస్తు చేసుకోవాలని హెచ్ఒడిలతో పాటు ఫ్యాకల్టీ సభ్యులకు సర్టిఫికెట్స్ అందజేశారు. "జాతీయ విద్యా విధానం -దాని ఫలితాల ఆధారిత విద్యా విధానం" అనే అంశంపై రత్నాకర్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రధాన లక్ష్యాలు, మల్టీ డిసిప్లినరీ విద్య, మాగృభాష బోధనా మాధ్యమం, వృత్తి విద్య, డిజిటల్ విద్యను కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు "ఇంజనీరింగ్ బోధనలో పెడగోగికల్ మెథడ్స్" అనే అంశంపై ప్రసంగించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు బోధించే ప్రతి అధ్యాపకులకు అత్యంత ముఖ్యమైన బోధనా పద్ధతుల ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సిఎస్ఇ హెచ్ఒడి డాక్టర్ కె.సుజాత "రివైజ్డ్ అక్రిడిటేషన్ ప్రేమ్ వర్కులు, అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ మెథడాలజీ" అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న వారితో డైట్ చైర్మన్ రత్నాకర్

ఎన్‌టిపిసి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ

సింహాద్రి ఎన్టిపిసిలో భద్రతా ప్రమాణాల వైఫల్యంతో ప్రమాదం జరిగిందని, ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఈ సంఘటనపై ఎన్‌టిపిసి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ వారు సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. చనిపోయిన కార్మికుల మృతదేహాలను గుట్టు చప్పుడు కాకుండా యాజమాన్యం రాత్రి సమయంలో బెంగాల్ తరలించిందని, మహారత్న పరిశ్రమలో ఈ రకంగా చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్మికులకు ఏమి నష్టపరిహారం చెల్లిస్తున్నారు? ఏ విధంగా ఆదుకుంటున్నారో యాజమాన్యం వెల్లడించాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్యులు అందించాలని కోరారు. యాజమాన్యం చట్టాలు ఉల్లంఘించడంపై లేబర్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు.

ఆదివారం నుంచి గేటు తెరుస్తాం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - యలమంచిలి

రైలు గేటు మరమ్మతులు శనివారం ఏ రాత్రికైనా ముగిస్తామని, ఆదివారం ఉదయం నుండి గేటు తెరుస్తామని రైల్వే వర్క్స్ తుని సూపర్‌వైజర్ సత్యనారాయణ తెలిపారు. 'గేటు పడితే నరకయాతన' శీర్షికన ప్రజాశక్తి దినపత్రిక శనివారం ప్రచురించిన కథనాన్ని సూపర్ వైజర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వాహనాలు రాకపోకలు ఎక్కువ కావడంతో గేటు మధ్య ట్రాక్ తరచూ బిగుసుకుంటోందని, దానికోసం రోడ్డును తవ్వి తిరిగి నిర్మించాల్సి వస్తోందని పేర్కొన్నారు. పడమర గేటు తెరుచుకోవడంలో కూడా సాంకేతిక లోపం ఉందని, దాన్ని కూడా సరిచేస్తున్నామని చెప్పారు. ఆదివారం నుంచైనా తమ కష్టాలు తీరుతాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : 5 సంవత్సరాల లోపు పిల్లలకు అన్ని టీకాలను సకాలంలో అందించి వారిని వ్యాధుల నుండి రక్షించాలని జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ మురళి అన్నారు. మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో చేపట్టిన మిషన్ ఇంద్రధనస్సు టీకాల కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ఆగస్ట్, సెప్టెంబరు, అక్టోబర్ నెలలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వి.ఎ.సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పి షాహిన్ అంజుం, ఎఎన్ఎం మరియారత్నం, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు కావేరి, వెంకటలక్ష్మి , వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదోసారి విద్యుత్ భారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్ రెడ్డి ప్రభుత్వంలో 10వ సారి రూ.1766 కోట్ల విద్యుత్ భారం వినియోగదారులపై మరోసారి వేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ, అనకాపల్లి జిల్లాకు విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు పేరుతో ప్రతి నెల వినియోగదారుల నుండి రూ.83 కోట్లు దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. సాధారణ గృహం నుండి కోటీశ్వరుల వరకు వివిధ రూపాల్లో ఫిక్సెడ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు, ట్రూ ఆఫ్ ఛార్జీలు పేరట అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు అర్థం కాని రీతిలో దోపిడీకి తెర లేపుతున్నారని, కరెంటు తీగలు పట్టుకోకుండానే బిల్లు చూస్తే షాక్ అయ్యే పరిస్థితి జగన్ రెడ్డి ప్రభుత్వంలోనే చూస్తున్నామని పేర్కొన్నారు. సౌర విద్యుత్తు, విండ్ విద్యుత్తు మార్కెట్లో తక్కువ ధరకే దొరుకుతున్నప్పటికీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యుత్ ప్లాంట్ నుండి అధిక రేట్లకు అప్పన్నంగా కొనుగోలు చేసి వారిని మరింత ధనికులుగా చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి మాడుగుల, చోడవరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పివిజి కుమార్, బత్తుల తాతయ్య బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనకాపల్లి డిఎన్ఓ, బిసి గర్ల్స్ హాస్టల్లో శనివారం సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఒమ్మి సతీష్ మాట్లాడుతూ పురిట పొత్తిళ్లలో నుంచే ఉద్యమాలు చేపట్టిన ఘనత ఒక ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. సామ్యవాద సమాజ స్థాపన కోసం త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వియ్యపు రాజు, శ్యామ్, శివ, రమ్య, శ్రావణి, లావణ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక ప్రభుత్వ కళాశాల బాలుర హాస్టల్లో ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సంఘం నాయకులు కె.సన్యాసిరావు, బాబ్జీ, హరికృష్ణ, నాయుడు, అభి పాల్గొన్నారు.

నేటి వైసిపి బహిరంగ సభకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-చోడవరం : ఆదివారం జరగబోయే నియోజకవర్గస్థాయి వైసిపి బహిరంగ సభకు చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం మొత్తం టెంట్ వేసి కుర్చీలను అమర్చారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగింపు సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న 86 సచివాలయాల పరిధిలో ఆయా గ్రామాల నుండి సుమారు 20వేల మంది ప్రజలు హాజరవుతారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వైవి.సుబ్బారెడ్డి, పలువురు మంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు.

తహశీల్దారు కార్యాలయంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మీడియాతో వారు మాట్లాడుతూ డిప్యూటీ తహశీల్దార్, భూములు రీసర్వే డిప్యూటీ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, నలుగురు అటెండర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దీంతో ప్రజలకు సేవలు అందించడంలో ఆలస్యమవుతుందన్నారు. ఆర్ఐ సెలవులో వున్నారన్నారు. స్పందన ద్వారా విన్నపాల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని చెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి సమస్యను విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపి సర్పంచ్‌ల ఫోరమ్ ప్రధాన కార్యదర్శి పినపోలు రామునాయుడు, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, కందిపూడి ఎంపిటిసి సీతా సన్యాసి నాయుడు, అగ్రికల్చర్ బోర్డు డైరెక్టర్ గుడాల ఆనంద్, కేపీ అగ్రహారం ఉప సర్పంచ్ దేవర ముసిలినాయుడు, కందిపూడి వైసిపి నేత కోట్ని అప్పారావు, సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యపై పోరాటం

ప్రజాశక్తి-సీతమ్మధార రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యాన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్దివేముల శ్రీనివాస్ తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు చేసిన ఉద్యోగ నియామకాల వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలుచేయకుండా యువతను మోసం చేస్తున్నారన్నారు. 'మా ఉద్యోగం-మా సంతకం' నినాదంతో రాష్ట్ర స్థాయి ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం, నాయకులు గౌరీశంకర్, కె.శ్రీనివాసరావు, ఇ.గిరిధర్ బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

49వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 49వ వార్డు పరిధి ఎన్జీజీవోస్ కాలనీలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అన్ని వర్గాల వారికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాత కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు ఎన్.రవికుమార్, జెసిఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 49వ వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీను, చంద్రశేఖర్, ఢిల్లీరావు, ఆర్.చిన్నారావు, శకుంతల, సబ్బవరపు శ్రీను, కె.మంగ, ఎస్.కనక, భవానీశంకర్, పల్లా చైతన్య, పావని, ఈశ్వరరావు, సిహెచ్.శ్రీను, మున్నా, బాబు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన రాయపురెడ్డి

ప్రజాశక్తి-దేవరాపల్లి : జనసేన మాడుగుల నియోజకవర్గం నాయకులు రాయపురెడ్డి కృష్ణ జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కొణిదల నాగబాబును విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సమయంలో మాడుగుల నియోజకవర్గంలో సమస్యలను, వైసీపీ చేస్తున్న అరాచకాలను, శారదా నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రహదారుల సమస్యలు వంటి వాటిని నాగబాబుకు వివరించారు. ఈ సమస్యలను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని నాగబాబు చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని శంకరం గ్రామంలో వెల్నెస్ సెంటర్ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై సిబ్బందికి అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సమీమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేడపై కూరగాయల పెంపకంతో లాభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలు తమ ఇళ్ల మేడలపై కూరగాయలు ఆకుకూరలు పెంపకం ద్వారా ఆదాయంతో పాటు ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ తెలిపారు. స్థానిక నూకాంబిక ఆలయం సమీపంలో వంశీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శనివారం గ్రీన్ క్లబ్, రూఫ్ గార్డెనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మేడపై కూరగాయలు, తోటల పెంపకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంగ, టమోటా, మిరప, క్యాబేజీ, కాలీఫ్లవర్, బంతి, చామంతి వంటి మొక్కలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు, రూఫ్ గార్డెనర్స్ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : పంచాయితీ రాజ్ శాఖలో 731 మంది టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు అమానుషమని, వారిని విధుల్లో కొనసాగించాలని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా సమితి కన్వీనర్ కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గత 13 ఏళ్లుగా టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్లుగా ఆయా జిల్లాలలో పని చేస్తున్న 731 మందిని శనివారం నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని, నిధుల కొరత వల్ల తొలగిస్తున్నామని పంచాయితీ రాజ్ లోని ప్రధాన ఇంజనీరింగ్ అధికారి ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమావేశంలో వియ్యపు రమణరావు , మద్దాల రమణాజీ పాల్గొన్నారు.

దహన వాటికల నిర్మాణం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మేజర్ పంచాయితీ పెదగుమ్మం శ్మశానం వాటికలో మూడు దహన వాటికలను నిర్మాణం చేశారు. ఎవరైనా మరణిస్తే దహనం చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మూడు మృతదేహాలను ఒకే సారి దహనం చేసేందుకు వీలుగా నిర్మాణం జరిగింది. ఇక్కడ 10 అడుగుల ఈశ్వరుడు విగ్రహం నిర్మాణం పూర్తి చేశారు. ఈ నిర్మాణానికి మాజీ సర్పంచ్ మళ్ల బుల్లి బాబు ప్రధాన కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతదేహాలు ప్రశాంతంగా దహనం జరిగే విధంగా ఉండాలన్న ఆలోచనతో వీటిని నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు.


కొత్తగా నిర్మించిన మృతదేహాల దహన వాటిక


మొక్కలు పంపిణీ వైసిపి నేత అజయ్‌రాజ్ తదితరులు

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని వైసిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణకు, కాలుష్యాన్ని నివారించేందుకు, ఆరోగ్యవంతమైన సమాజానికి మొక్కలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం కొబ్బరి, జామ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, స్థానిక సర్పంచ్ డి. ప్రసాదరావు, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు, వైస్ ఎంపిపి శరగడం రూన్నీ లక్ష్మిరాణి రాము, సబ్బవరపు నారాయణ మూర్తి, ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు, టి.శేఖర్, ట్రస్ట్ చైర్మన్ పి.విజయ్ కుమార్, ప్రతినిధులు పి.వరలక్ష్మి, ఎస్.శంకర్, పి.సూరిబాబు, వి. జయబాబు, పి. ఆనందరావు, పి. విజయ్ కుమార్, ఎస్.నాయుడు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలు నాటివేత

మండలంలోని బాట జంగాలపాలెం గ్రామంలో సర్పంచ్ పడాల వెంకట రమణ ఆధ్వర్యంలో బడిబంధ చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలను శనివారం నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద కొబ్బరి మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ మదీనా, చెరువు సంఘం మాజీ అధ్యక్షులు వనం సన్యాసిరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి గాయత్రి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి హైస్కూల్లో 2022-2023 పదవ తరగతి విద్యార్థి కాలెపు తేజస్విని శ్రీకాకుళం ట్రిబుల్ ఐటిలో ప్రవేశం పొందింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తేజస్వినికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి ఉచిత కంటి వైద్యం, రక్తదాన శిబిరాలు వాయిదా

ప్రజాశక్తి- అచ్యుతాపురం : ఈ నెల 13న ఆదివారం జరగాల్సిన బ్రాండిక్స్ కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను అనివార్య కారణాల వల్ల ఆగస్టు 27కు వాయిదా వేసినట్లు బ్రాండిక్స్ ఇండియా భారతీయ భాగస్వామి దొరస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ 111 నేత్ర వైద్య శిబిరాల ద్వారా 59 వేల మంది నిరుపేదలకు కంటి సంబంధ ఉచిత వైద్య సేవలు, 40 వేల మందికి ఉచితంగా కళ్లద్దాలు, 5 వేల మందికి కంటి శస్త్ర చికిత్సల సేవలను అందించినట్లు పేర్కొన్నారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆగస్టు 13న జరగాల్సిన 112వ కంటి వైద్య శిబిరం 27న నిర్వహిస్తామని చెప్పారు. ఇదే రోజున రెడ్‌క్రాస్ వారి సహకారంతో నిర్వహించాల్సిన రక్తదాన శిబిరాన్ని కూడా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆగస్టు 27న నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని దొరస్వామి ప్రకటనలో కోరారు.

నేడు క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కశింకోట : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఈ నెల 18న జరగనున్న నేపథ్యంలో కశింకోట మండలం టిడిపి నాయకులు ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. మండలంలోని టిడిపి సభ్యత్వం తీసుకున్నా వారు ఆడేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు కోసం సెల్ నెంబర్ 9550805859కు సంప్రదించాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- పాయకరావుపేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్ఆర్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. పట్నంలోని ప్రధాన మెయిన్ రోడ్డు కోటి 90 లక్షల రూపాయలతో గౌతమి థియేటర్ నుంచి వై జంక్షన్ వరకు రోడ్డు ఎట్టకేలకు శనివారం ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబురావు, విఎమ్ఆర్డిఏ చైర్ పర్సన్ విజయనిర్మల శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు మంజూరు చేసినప్పటికీ వేయలేదన్నారు. టిడిపి నేతలే పాయకరావుపేట ప్రధాన మెయిన్ రోడ్డు పనులను ఇప్పటివరకు అడ్డుకున్నారని తెలిపారు. ఎప్పటికైనా పాయకరావుపేట ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పబ్లిక్ ప్రచార వింగ్ చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, వైయస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబురావు, ఎంపీపీ పార్వతీ తాతారావు, పాయకరావుపేట సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుంటూరు శ్రీనివాసరావు, తహశీల్దార్ జయప్రకాష్, ఎంపీడీవో సాంబశివరావు, అధికారులు, నాయకులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉపాధి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఎస్.రాయవరం: ఉపాధి హామి కూలీల బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో వేమగిరి గ్రామంలో శనివారం ఉపాధి కూలీలను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తిమ్మాపురం, వేమగిరి, జంగుల్లూరు, వేలంపాలెం గ్రామాల్లోని కూలీకుల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం బకాయిలు వెంటనే విడుదల చేసి ఉపాధి కూలీలను ఆదుకోవాలని తెలిపారు. సమ్మర్ ఎలివేన్స్, గుణపాం, తట్ట వంటి వాటిని ఇవ్వాలన్నారు. ఉపాధి హామి పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో నీడకు టెంట్లు, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకటలాడింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, దాతల సహకారంతో ప్రతి శనివారం ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయ ప్రాంగణం వద్ద 1000 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలా చార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు .

'నీమాస్త్రం' తయారీపై అవగాహన

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం దొండపూడి గ్రామంలో నీమాస్త్రం తయారీ పై స్థానిక రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్పీ గుణావతి మాట్లాడుతూ, వరి పంటలో అధిక నష్టాన్ని కల్గించే రసం పీల్చే పురుగు, వాటి గుడ్లను, చిన్న చిన్న గొంగళిపురుగులను నాశనం చేసే నీమాస్త్రం ఉపయోగాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక డ్రమ్ములో 200 లీటర్ల నీటిని తీసుకుని దానిలో 10లీటర్ల గోమూత్రం, రెండు కేజీల ఆవుపేడ ముద్దగా చేసిన 10 కేజీల వేపాకు కలిపి ఉదయం సాయంత్రం సవ్యదిశలో కలిపితే 48 గంటల్లో నీమాస్త్రం తయారవుతుందన్నారు. ఈ కషాయం రసం పీల్చే పురుగు, గుడ్లను, చిన్న చిన్న గొంగళి పురుగులను నాశనం చేస్తుందని వివరించారు. రైతులు తప్పనిసరిగా తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిఎస్ఎఫ్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ సిబ్బంది



సర్టిపికెట్లు ఇస్తున్న నిర్వాహకులు

గీతం ఫిజియోథెరపీ డైరక్టర్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి -మధురవాడ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ మహిళా విభాగం నుంచి జాతీయ స్థాయిలో స్ఫూర్తిదాయకురాలైన నాయకురాలిగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరక్టర్ డాక్టర్ మాధురీ కాశీ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఫిజియోథెరపీ ప్రథమ జాతీయ సమావేశాలలో వరల్డ్ ఫిజియోథెరపీ అధ్యక్షుడు డాక్టర్ మైక్ ల్యాండ్రీ ద్వారా ఈ అవార్డును డాక్టర్ మాధురీ కాశీ అందుకున్నారు. ఈ సమావేశాలలో ఫిజియోథెరపీ భవిష్యత్తు, నూతన పద్ధతులు, వృత్తినైపుణ్యాలపై జరిగిన చర్చలలో సైతం పాల్గొన్నారు. బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో కలిసి సమావేశాలకు హాజరవడంతో పాటు పలు శాస్త్రీయ చర్చలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: తమ మిత్రుడు, కీర్తిశేషులు కర్రి రాజీవ్ గాంధీ జ్ఞాపకార్థం మిత్రులంతా కలిసి శనివారం మండల కేంద్రంలో విశాఖకు చెందిన అమ్మ బ్లడ్ బ్యాంకు నేతృత్వంలో సుమారు 80 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరందరికీ బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్‌లను మదర్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బొలిశెట్టి గోవింద్, మండల వైయస్సార్ సిపి పార్టీ అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు, గాంధీ మిత్రులు కర్రి శేఖర్, పితాన సతీష్, ప్రసాదు, సునీల్, మధు, పులి సత్తిబాబు యువకులు పాల్గొన్నారు.

వరి నారు నష్టంపై విచారణ

ప్రజాశక్తి- చీడికాడ: మండలం కోణం పంచాయతీలో శివారు గుంటి గ్రామంలో కోట పెద్దదేముడు తన పొలంలో వరి ఆకును వేసుకున్నాడు. కొంతమంది కక్షపూరితంగా తన వరి ఆకును కలుపు నివారణ మందులు స్ప్రే చేసి నాశనం చేశారని, పెద్దదేముడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. డి.ఎస్.పి సుబ్బరాజు శనివారం హుటాహుటిన గుంటి గ్రామాన్ని సందర్శించి వరి ఆకు ను పరిశీలించారు. గుంటి గ్రామం గిరిజనులకు, గుంటి కొత్తూరు గిరిజనేత రులకు డి ఫామ్ పట్టాల భూములపై గత కొంతకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. ఈ మేకరు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదవడంతో వాటిపై కూడా డిఎస్పి సుబ్బరాజు ఆరా తీసీ గిరిజన ల వద్ద ఉన్న పత్రాలు పరిశీలించి విచారణ జరిపించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ పి.రామారావు, ఏఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలను తెలియజేస్తున్న బాధితులు




ఆందోళన చేస్తున్న మహిళలు

నాటు సారా నియంత్రించాలని

మహిళల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డిఎల్ పురంలో నాటు సారా నియంత్రించాలని గ్రామానికి చెందిన మహిళలు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో నాటు సారా నియంత్రించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామంలో విచ్చలవిడిగా నాటు సారా తయారీ విక్రయాలు చేపట్టడంతో అనేకమంది మద్యానికి బానిసై రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల్లో తగువులు, తగాదాలు, కలహాలు ఏర్పడుతున్నాయని పలువురు మహిళలు వాపోయారు. గతంలో గ్రామంలో ఆందోళన చేపడితే కొందరు నాటు సారా తయారీ మానేశారని ,ఇంకా చాలామంది నాటు సారా తయారు చేస్తున్నారన్నారు. పోలీసులు స్పందించి గ్రామంలో పూర్తిగా నాటు సారా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. సారా నియంత్రణకు చర్యలు చేపడతామని ఎస్ఐ శిరీష హామీ ఇచ్చారు.

ఓటర్ సర్వేపై అప్రమత్తంగా ఉండాలి



పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటా జరుగుతున్న ఓటర్ సర్వేను శనివారం అధికారులు, బూత్ లెవెల్ సూపర్వైజర్లు పరిశీలించారు. ఈ మేరకు ఈఆర్ఓ రామలక్ష్మి, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ నీరజ, రెవిన్యూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఓటర్ సర్వే తీరును క్షుణంగా పరిశీలించారు. ఈనెల 21 తేదీతో సర్వే ముగుస్తుండటంతో మరింత వేగంగా సర్వే చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటివి నిష్పక్షపాతంగా చేపట్టాలని ఆదేశించారు. స్పష్టమైన పూర్తి ఆధారాలు ఉంటే తప్ప ఓటర్లను తొలగించకూడదన్నారు.

కోటవురట్ల: ఓటర్ జాబితా ధృవీకరణ, తొలగింపు విషయంలో నిబంధనలు పాటించాలని పోలింగ్ స్టేషన్ల సూపర్వైజర్ ఊర్ధవరావు సూచించారు. మండలంలో కైలాస పట్నం, తంగేడు, లింగాపురం, కోటవురట్ల తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ సర్వేను పరిశీలించారు. ప్రధానంగా ఓట్ల తొలగింపు విషయంలో నిబంధనలు పాటించాలని, ఇష్టానుసారంగా ఓట్లు తొలగిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉందని బిఎల్ఓలకు సూచించారు. నమోదు, తొలగింపులు, సవరణలు వంటి వాటిపై రికార్డులు తప్పనిసరిగా పొందుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సిబ్బంది

15న టిడిపి విజన్ డాక్యుమెంట్ 2047 విడుదల

-నగరానికి రానున్న చంద్రబాబు-టిడిపి మాజీ మంత్రి బండారు



మాట్లాడుతున్న బండారు


ప్రజాశక్తి - కలెక్టరేట్ : భవిష్యత్తు రాష్ట్ర ప్రణాళిక లో భాగంగా తెలుగుదేశం పార్టీ విజన్ డాక్యుమెంట్ 2047 విడుదల కార్యక్రమం ఈనెల 15న విశాఖపట్నంలో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి తమ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు.శనివారం టిడిపి కార్యాలయంలో టిడిపి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 15న సాయంత్రం 4 గంటలకు బీచ్ రోడ్ లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి 2 కిలోమీటర్లు మేర చంద్రబాబు బీచ్ వాక్ చేస్తారన్నారు.విజన్ 2020 డాక్యుమెంట్ ఫలాలు ఇప్పుడు అందుతున్నాయన్నారు.అందుకు హైటెక్ సిటీ నిర్మాణమే నిదర్శనం అన్నారు.ఎపిలో 7 విమానాశ్రయాలు, నైట్ ల్యాండింగ్ సదుపా యాలు వచ్చాయన్నారు.భవిష్యత్తు ను ఊహించి రూపొందించిన డాక్యుమెంట్ ఇది అన్నారు స్వాతంత్ర్య దినోత్సవం రోజున విజన్ డాక్యుమెంట్ 2047 ను ఆవిష్కరించ బోతున్నారన్నారు.డాక్యుమెంట్ రిలీజ్ లో ప్రజాభిప్రాయం తీసుకుంటామని,వాటిని కూడా జోడిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకష్ణ బాబు, పి.వి.జి. ఆర్ నాయుడు(గణబాబు), రాష్ట్ర పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యలు, నియోజవర్గ ఇన్చార్జీలు కోళ్ల లలిత కుమారి,గండి బాబ్జీ, నియోజవర్గ ఇన్చార్జిలు బత్తుల తాతయ్య బాబు, పి.వి.జి కుమార్, కోరాడ రాజబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామనాయుడు, ఉత్తరం నియోజవర్గం చిక్కాల విజయ్ బాబు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ నాయకులు ఎం.డి నజీర్,కోళ్ల రాంప్రసాద్,వి. ఎస్.ఎన్ మూర్తి యాదవ్,రాజాన రమేష్, లొడగల కృష్ణ, పుచ్చా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా యోగా పోటీల్లో

రాంబాబుకు ప్రథమ స్థానం



ప్రజాశక్తి -నక్కపల్లి: ఈ నెల 4,5,6 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఆన్లైన్‌లో యోగా పోటీల్లో ఉపమాక గ్రామానికి చెందిన దవరసింగి రాంబాబు మొదటి స్థానం సాదించారు. కర్ణాటకకు చెందిన బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ నేషనల్ లెవెల్ ఓపెన్ యోగా ఛాంపియన్షిప్ పోటీల్లో 50నుంచి 60 ఏళ్ల విభాగంలో రాంబాబు చేసిన యోగాసానాలకు ఈ పురస్కారం లభించింది. 2020లో ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో కూడా రాంబాబు రెండో స్థానం సాధించారు. విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామంలో రాంబాబు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. జాతీయ స్థాయిలో రాంబాబు మొదటి స్థానం సాధించడం పట్ల రాజకీయ పార్టీల నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.



నీరు లేక ఎండిపోతున్న వరి నారు

ఎండుతున్న వరి పంటలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-రోలుగుంట: గత వారం రోజులుగా కాస్తున్న ఎండలతో వరి రైతుల్లో కలవరం మొదలైంది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వాగు, వంకలు పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వర్షం పడుతుంది కదా అనే నమ్మకంతో బురదలోనే రైతులు నాట్లు వేశారు. ఈ మధ్య కాస్తున్న ఎండల తీవ్రతకు పొలాలు వర్రెలు వేయడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఇంటిలో ఉన్న సొమ్మును వరి పైరుకు ఖర్చు చేశామని, వర్షాలు సమృద్ధిగా పడినా దిగుబడులు రావని రైతులు అంటున్నారు.కలుపు కూడా ఎక్కువైందని, ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల: అణుకు గిరిజన గిరిజన గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 37వ రోజుకు చేరుకున్నాయి. గ్రామానికి మౌలిక వసతులతో పాటు పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు డేవిడ్‌రాజు, గిరిజన గ్రామ మహిళలు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని సుంకరమెట్ట పంచాయితీలో కేంద్రంలో సుంకరమెట్ట సర్పంచ్ చిన్న బాబు ఆధ్వర్యాన మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పంచాయతి పరిధిలో సుమారు 18 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.నానిబాబు, వివిధ టీమ్ కెప్టెన్స్ పాల్గొన్నారు.

862వ రోజుకు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్: ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకునే విషయంలో జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ స్పందించాలని ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం విజ్ఞప్తి చేశారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 862వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్పిసిఎల్, ఐఎన్ టియుసి కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు.లాభాల్లో నడుస్తున్న ఈ కర్మాగారం నష్టాల వైపు వెళ్లటానికి కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణమన్నారు. కర్మాగారానికి నష్టం వచ్చే విధంగా, కర్మాగారం ఉత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీస్తూ కేంద్రం ఇటీవల కుట్రలు చేస్తూ వస్తుందని ఆరోపించారు. ఎప్పటికైనా స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి హెచ్పిసిఎల్ యూనియన్ కార్యదర్శి వై.నరసింగరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.తాతబాబు పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఔట్సోర్సింగ్ రికార్డు అసిస్టెంట్ గేడ్డమూరి సత్యనారాయణ(50) శనివారం మధ్యాహ్నం అనకాపల్లిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన గడచిన 20 సంవత్సరాలుగా హైస్కూల్లో పని చేశారు.ప్రతి ఒకరితో మర్యాద పూర్వకంగా ప్రవర్తి స్తూ అందరి మన్ననలు పొందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి.

ఓట్ల వెరిఫికేషన్‌ను త్వరగా చేపట్టాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నియోజకవర్గంలో జరుగుతున్న ఓట్ల వెరిఫికేషన్‌ను త్వరితంగా చేపట్టాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. శనివారం మీడియాకు పంపిన వీడియోలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఓట్ల వెరిఫికేషన్ ప్రక్రియ చాలా ఆలస్యంగా జరుగుతుందని, దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్, ఆర్డిఓలు స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో రెండు లక్షల 11 వేల ఓటర్లు ఉండగా కేవలం 57,800 ఓట్లు మాత్రమే పరిశీలన చేశారని, 27శాతం మాత్రమే వెరిఫికేషన్ ప్రక్రియ జరిగిందన్నారు. దొంగ ఓట్లు తొలగించక పోవడం బాధాకరమన్నారు. ఓట్లు వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించి 21 రోజులు పూర్తి అవుతున్నప్పటికీ ఎందుకు జరగలేదన్నారు. ఓటరు బతికి ఉండగానే ఓట్ల తొలగింపు జరిగిందని పూర్తి పరిశీలన చేసి ఓటరు నమోదు చేయాలన్నారు. గొలుగొండ మండలంలో 41,552 ఓట్లకు గాను 8500 ఓట్లు మాత్రమే వెరిఫికేషన్ జరిగిందని తెలిపారు. నాతవరం మండలంలో 51,648 ఓట్లకు గాను కేవలం 23,236 ఓట్లు, నర్సీపట్నం టౌన్ లో 47, 958 ఓట్లకు గాను 12600, నర్సీపట్నం మండలంలో 23,560 ఓట్లకు గాను 3900 ఓట్లు మాత్రమే వెరిఫికేషన్ జరిగిందని తెలిపారు. 21 రోజులు పూర్తి అవుతున్నప్పటికీ ఓట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు.



మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్న గిరిజనులు



పేలిన తుపాకీ ఇదే..

నాటు తుపాకీ పేలి గిరిజనుడు మృతి

ప్రజాశక్తి- పెదబయలు :అడవి పంది వేటకు అడవికి వెళ్లిన బృందం సభ్యుల్లో ఒకరు ప్రమాదవశాత్తు నాటుతుపాకి పేలడంతో మృతి చెందిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లాలో చోటు చేసుకుంది. పెదబయలు మండలం వనుకొంతూరు కొండల్లో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జి.మాడుగుల మండలం మారుమూల కిల్లంకోట పంచాయతీ కప్పలు గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లారు. కొండలు, గుట్టలు దాటుకుంటూ వెళుతున్న క్రమంలో బుటారి బొంజుబాబుకు అడవి పంది అడుగు జాడలు కనిపించాయి. అడవి పంది అడుగు జాడలు చూస్తూ ముందుకు వెళుతున్న క్రమంలో వెనుక ఉన్న ఎండ్రపల్లి సూరిబాబు చేతిలోని నాటు తుపాకి ప్రమాదవశాత్తు పేలడంతో బుటారి బొంజుబాబు శరీరంలోకి బుల్లెట్లు చొచ్చుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జి.మాడుగుల సిఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్ పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. నాటుతుపాకి స్వాధీనం చేసుకొని, వేటకు వెళ్లిన మరో నలుగురు బుటారి మాలన్న, వెంబరి సుబ్బారావు, బుటారి సింహాచలం, ఎండ్రపల్లి సూరిబాబులను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం జి.మాడుగుల పోలీస్ స్టేషన్ కు తరలించారు. బుటారి బొంజుబాబు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మోడీ పాలనలో కార్మిక వర్గంపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మోడీ పాలనలో దేశ వ్యాప్తంగా కార్మిక వర్గంపై దాడులు పెరిగాయని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. సంఘం విశాఖ జిల్లా 13వ మహాసభలు ప్రారంభం సందర్భంగా శనివారం సరస్వతీ పార్క్ నుంచి డాబా గార్డెన్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రధానిగా వచ్చిన తర్వాత 155 లక్షల కోట్లు అప్పు చేసి దేశ ప్రతిష్టను దిగజార్చారని ఆరోపించారు. దేశం మూడో ఆర్థిక శక్తిగా అవతరిస్తోందని చెప్పిన ప్రధాని నేడు ఎందుకు ఆకలి చావులు అధికంగా ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణాల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి మోడీ కుట్రలు చేస్తున్నారు. ఈ అంశంపై మాట్లాడాల్సిన అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, జిల్లా అధ్యక్షులు పడాల రమణ, ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొన్నారు.